భారత్‌లో బ్రిటీష్ రాజ్

భారతదేశ చరిత్రలో మధ్యయుగం... ముఖ్యంగా ఆంగ్లేయులు వచ్చినప్పటి నుంచి అనేక కీలక పరిణామాలు సంభవించాయి. వారు మొగలుల నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. అప్పటివరకూ పరిచయం లేని కొత్త వ్యవస్థలను, పాలనా పద్ధతులను భారత్‌కు పరిచయం చేశారు. మధ్యయుగ చరిత్రపై సివిల్స్, గ్రూప్స్‌లో... ప్రిలిమ్స్, మెయిన్స్‌లోనూ ప్రశ్నలు వచ్చే అవకాశముంది. మధ్యయుగ చరిత్రపై కథనం...

బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ భారత్‌లో మొదట చాలా చిన్నగా మొదలైంది. భారతదేశ సంస్థానాధిపతులను తమకు అనుకూలంగా మలచుకుంటూ,ఐరోపాకు చెందిన వ్యాపార శత్రువులపై ఆంగ్లేయులు క్రమేణా పైచేయి సాధించారు. 1687 వరకు ఈస్టిండియా కంపెనీకి ఉన్న ఏకైక వ్యాపార స్థావరం సూరత్. సూరత్‌ను జహంగీర్ కాలంలో పోర్చుగీసు వారిని ఓడించి కైవసం చేసుకున్నారు. వాస్తవానికి మొగలులతో ఒప్పందం ప్రకారం... ఆంగ్లేయులు సూరత్‌లో మాత్రమే వస్త్ర వ్యాపారం చేసుకోవాలి. ఎలాంటి కోటలు నిర్మించకూడదు.. ఈ నిబంధనలను ఆంగ్లేయులు ధిక్కరించారు. దాంతో మొగల్ అధికారులు బ్రిటిష్ వాళ్లను బంధించి, శిక్షించారు. అంటే.. అప్పటికింకా భారత్‌పై మొగలుల పట్టుసడలలేదు.

అస్తమించిన విజయనగర సామ్రాజ్యం

మొగలుల అధికారం కొనసాగుతున్న సమయంలో ఉత్తర భారతదేశంలో స్థానం కోసం ఆంగ్లేయులు విశ్వప్రయత్నం చేశారు. కానీ పరిస్థితి అంతగా అనుకూలించలేదు. దాంతో దక్షిణాదిపై దృష్టి సారించారు. ఎందుకంటే..? దక్షిణాన శక్తివంతమైన రాజ్యం లేదు. బలమైన విజయనగర రాజ్యం 1556లోనే అస్తమించింది.

ఇక మిగిలినవన్నీ చిన్నచిన్న రాజ్యాలు బహమనీలవి! దక్షిణాదిలో ఆంగ్లేయులు తమ మొదటివర్తక ఫ్యాక్టరీని 1611లో మచిలీపట్నంలో ప్రారంభించారు. అనంతరం వర్తక కార్యకలాపాలను మద్రాస్‌కు మార్చారు. ఇక్కడ కోట కట్టుకోవడానికి, పరిపాలనకు.. ఓడరేవు మీద సుంకాల ద్వారా వచ్చే రాబడిలో సగం తనకు చెల్లించే షరతుపై నాణేలు ముద్రించుకోవడానికి చంద్రగిరి రాజా ఆంగ్లేయులకు అధికారాలిచ్చాడు. దాంతో వాళ్లు ఇక్కడే సెయింట్ జార్జికోటను, సెయింట్ డేవిడ్ కోటను నిర్మించుకున్నారు.

ఆంగ్లేయులు 1668లో పోర్చుగీసు వారి నుంచి కట్నం కింద బొంబాయిని పొందారు. దాంతో వారికి సురక్షితమైన, విశాలమైన కోట ఒకటి దొరికినట్లయింది. ఫలితంగా సూరత్‌కు ప్రాధాన్యం



తగ్గించి, బొంబాయిపై దృష్టిసారించారు.

ఇక తూర్పు భారత దేశంలో 1663లో ఒరిస్సాలో తమ మొదటి వర్తక స్థావరాన్ని ఏర్పాటుచేసుకున్నారు. బెంగాల్‌లోని హుగ్లీ వద్ద వ్యాపారం నిర్వహించుకునేందుకు 1651లో అనుమతి పొందారు.

వెంటనే పాట్నా, బాలసోర్, ఢాకా, బెంగాల్, బీహార్‌లలోని మరికొన్నిచోట్ల ఫ్యాక్టరీలను నిర్మించుకున్నారు. బెంగాల్‌లో కూడా ఒక స్వతంత్ర వ్యాపార సంస్థను నెలకొల్పుకోవాలని ఆంగ్లేయులు భావించారు.

అవకాశమిచ్చిన ఔరంగజేబు

భారత్‌లో ఔరంగజేబు పాలన కొనసాగుతున్న సమయమది! పర మత సహనం పరిమితంగా ఉన్న ఔరంగజేబు.. మహారాష్ట్రలో గొడవల్లో మునిగి ఉన్నాడు.. మొగలుల పాలనతో అంతా సవ్యంగా లేదన్న విషయం ఆంగ్లేయులకు అర్థమైంది. దాంతో భారత్‌లో రాజకీయాధికారం సాధించాలనే ఆలోచన వారిలో మొదలైంది. ఆ తరుణంలో ఔరంగజేబు అనారోగ్యం బారిన పడ్డాడు..దాన్ని నయం చేసిన బ్రిటిష్ వైద్యుడు గాబ్రియల్ బౌటాన్‌కు హుగ్లీ నదీ తీరంలోని భూమిని బహుమానంగా ఇచ్చాడు. దీనివల్ల ఆంగ్లేయులు సుంకం కట్టకుండానే ఎగుమతి, దిగుమతులను చేసుకోవచ్చు.

మొగల్ చక్రవర్తి ఫరూఖ్‌సియర్, డాక్టర్ హమిల్టన్‌కు బెంగాల్‌లో వ్యాపారానికి అనుమతిస్తూ ఫర్మానాలు జారి చేశాడు. ఈ నేపథ్యంలో సుతానతి, కాళీఘాట్, గోవిందాపూర్‌లను కలిపి జాబ్ ఛార్నాక్ కలకత్తా నగరాన్ని నిర్మించాడు. ఇక్కడే ఆంగ్లేయులు ఫోర్ట్‌విలియం కోటను నిర్మించుకున్నారు. మద్రాస్, బొంబాయి, కలకత్తాలలోని బ్రిటీష్ స్థావరాలు... ఆయా ప్రాంతాలు మహానగరాలుగా అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పించాయి. వర్తకులు, బ్యాంకర్లు ఈ నగరాల వైపు అధికంగా ఆకర్షితులయ్యారు. అదే సమయంలో మొగల్ సామ్రాజ్యం పూర్తిగా బలహీనమవడం ప్రారంభమైంది. చాలా ప్రాంతాల్లో ప్రజలకు భద్రతా లేకుండా పోయింది. కనుకనే మద్రాస్, బొంబాయి, కలకత్తాల్లో జనాభా అనూహ్యంగా పెరిగింది. 18వ శతాబ్దంలో మద్రాస్ జనాభా మూడు లక్షలకు, కలకత్తా జనాభా రెండు లక్షలకు, బొంబాయి జనాభా డెబ్భై వేలకు పెరిగింది.

ప్లాసీతో సామ్రాజ్యానికి పునాది

భారతదేశంలో ఆంగ్లేయుల రాజకీయ ఆధిపత్యం 1757లో జరిగిన ప్లాసీ యుద్ధంతో మొదలైంది. ఈ యుద్ధంలో తూర్పు ఇండియా బలగాలు బెంగాల్ నవాబు సిరాజుద్దౌలాను ఓడించాయి. రాబర్ట్ క్లైవ్ ఆంగ్లేయుల తరపున పాల్గొని, విజయం సాధించాడు.

ప్లాసీ యుద్ధానంతరం ఆంగ్లేయులు మీర్‌జాఫర్‌ను పాలకుడిగా నియమించారు. మీర్ జాఫర్, ఆంగ్లేయులను సంతృప్తిపరచనందున అతని అల్లుడు మీర్ ఖాసీంను బెంగాల్ నవాబును చేశారు.. మీర్ ఖాసీం కాలంలోనే బక్సర్ యుద్ధం 1764లో జరిగింది. ఈ యుద్ధంలో గెలిచిన ఆంగ్లేయులు.. 1765లో జరిగిన అలహాబాద్ సంధి ప్రకారం బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో దివానీ అధికారం పొందారు. దివానీ అంటే పాలనాధికారం. దీన్ని రాబర్ట్ క్లైవ్ ప్రవేశపెట్టాడు.

ప్లాసీ, బక్సర్ యుద్ధానంతరం ఈస్టిండియా కంపెనీ తమ పాలనా ప్రతినిధులుగా గవర్నర్‌లను నియమించడం ఆరంభించింది.1758 నుంచి 1760 మధ్యకాలంలో మొదటి బెంగాల్ గవర్నర్‌గా రాబర్ట్ క్లైవ్ పనిచేశాడు. 1773 నాటికి ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో ప్రముఖ రాజకీయాధికార శక్తిగా ఎదిగింది.బ్రిటన్‌లో కంపెనీ డైరెక్టర్లు, ఇండియాలో కంపెనీ అధికారులు భారత్‌పై మరింత ఆధిపత్యం కోసం ప్రయత్నించారు.

తొలిగవర్నర్ జనరల్ హేస్టింగ్స్

1773లో రెగ్యులేటింగ్ చట్టం ప్రకారం బెంగాల్ గవర్నర్‌ల వ్యవస్థ బెంగాల్ గవర్నర్ జనరల్స్ వ్యవస్థగా రూపొందింది. ఇలా బెంగాల్ తొలి గవర్నర్ జనరల్‌గా వారన్ హేస్టింగ్స్ నియమితుడయ్యాడు.. ఇతని కాలంలోనే కంపెనీ.. శిస్తు వసూలు కోసం జిల్లాకి ఒక కలెక్టర్‌ను నియమించింది. దీన్నిబట్టి తొలికాలంలో శిస్తు వసూలు కోసమే అంటే.. వసూళ్ల కోసమే కలెక్టర్ వ్యవస్థ ఏర్పడింది. దీనిని ఏర్పాటు చేసిన వారు వారన్ హేస్టింగ్స్. కలెక్టర్ వ్యవస్థ వేరు, సివిల్ సర్వీసుల వ్యవస్థ వేరు. సివిల్ సర్వీసుల వ్యవస్థను ప్రవేశపెట్టింది కారన్ వాలీస్.